# దూరెన్ పాము

*గారపాటి* సత్యంగారింట్లోకి పాము దూరినప్పట్నించీ శ్రీనివాసరావుకి నిద్ర పట్టడం లేదు. భోజనం కూడా రుచించడం లేదు. నిద్రలేమి కళ్లతో మామూలుగా ఎనిమిదిన్నరకి లేచేడతను. కళ్లు ఎర్రగా ఉన్నాయి. బుర్రలో దూది కుక్కినట్టుంది. తలపట్టుకుని మంచం చివర కూచున్నాడు. నిద్ర లేచేడేమో చూద్దావని వచ్చి ఆమె అతనికి జ్వరం తగిలిందేమో ననుకుంది. నుదుటిమీద వేళ్లతో రాస్తూ 'జ్వరంలేదం'దామె. ఏవీ లేదు. అంటే జ్వరం వంటి వ్యాధుల్లేవు. ఆఫీసుకెళ్లాలి. లేచి పళ్లు రుద్దుకుంటూ సింకు దగ్గిర్నించి హాల్లోకి చూశాడతను. నల్లటి పాము సోఫా కిందికి జారుతోంది. తన పాపం పండింది. పేస్టు గొంతుకడ్డుపడి 'పాము పాము' అని అరిచేడతను. ఒక్కగెంతులో వంటింట్లోంచి ఇవతలికొచ్చి ఆమె అతన్ని ఆశ్చర్యంగా చూసింది. కళ్లు పెద్దవి చేసి ఒణుకుతోన్న చేత్తో పాము వేపు చూపించాడతను. పాము వేపూ అతని వేపూ ఒకసారి పరీక్షగా చూసి విసవిస వెళ్లి సోఫా కిందినుంచి పాముని లాగి మెళ్లో వేసుకుందామె.

'పావనుకున్నాను'. మరోసారి అతన్ని అదోలా చూసి మెళ్లో వేసుకున్న పొడవాటి గాలిపడగతోకని అక్కడే పారేసి లోపలికి వెళ్లిపోయిందామె. కాళ్లు రెండూ చచ్చినపాముల్లా ఉన్నాయి. పడకుండా సింకు పట్టుకుని నుంచి ముఖం చూసుకున్నాడతను. నీరసించి కళ్లు లోతుకుపోయి కనిపించాడతను. కాఫీ తీసుకొచ్చి ఇస్తూ కళ్లనీళ్లు పెట్టుకుందామె. కొన్ని నెలల్నించీ అతన్ని పాములాంటిదేదో వెంటాడుతోంది. పుట్టలో పాలు పోయించింది. గుళ్లో పూజలు చేయించింది. సర్పదోషం పోవడానికి చెంచువాడి దగ్గిర వందరూపాయలిచ్చి తాయెత్తు కూడా తీసుకుంది. కాఫీ తాగుతూ పేపరుచూస్తున్నట్టు నటిస్తుండగా రాత్రి కల పేపరు మీద అచ్చయింది. ఎవరిదో ఇంటి ముందు షామియానా, గుంపుగా జనం. అతను వెళ్తున్నవాడు ఆగి చూశాడు. పెద్దాయన్ని బెంచీ మీద పడుకోబెట్టేరు. రాత్రి పాము కరిచి చచ్చిపోయాట్ట. సత్యంగారు కమిలిపోయి చచ్చిపోయి పడుకున్నారు. అతను రాగానే అందరూ అతని వేపు చూశారు. వాళ్లందరి కళ్లలో ద్వేషం స్పష్టంగా కనిపిస్తోంది. తల వంచుకుని పారిపోయాడతను. అతని కెప్పుడూ అదే కల వస్తూంటుంది.

ముందు ఇల్లు ఖాళీ చేశాడు శ్రీనివాసు. దూరంగా నగరానికి ఒక పక్క ఫ్లాట్ తీసుకున్నాడు. మళ్లీ పాత ఇంటివేపు వెళ్లలేదు. ఒకసారి సందుచివర ఉండే శర్మగారు

బజార్లో కనిపించారు. అతన్ని చూడగానే నవ్వుతూ రోడ్డు దాటి పలకరించడానికి వస్తున్నాడు. అతని కేం చెయ్యాలో తోచలేదు. శర్మగారు ఎందుకొస్తున్నారో తనకు తెలుసు. సత్యం గారింట్లో ఎవరో ఖాయంగా పోయుంటారు. రిక్షా అడ్డుపెట్టుకుని పారిపోయాడతను. ఇంటికి వెళ్లిం తరవాత చాలాసేపు ఆలోచించాడు శ్రీనివాసు. తెలీకుండా ఎలా ఉంటుంది? తన ఎడ్రస్ ఎవరికీ తెలీకుండా జాగ్రత్తపడ్డాడు. ఫోన్ నంబరు మార్పించుకున్నాడు. పాత ఇంటివేపు వెళ్లడం లేదు. ఈ మరణాలకి దూరంగా ఎలా పారిపోడం? ఎక్కడోఎవడో ఒక పాత పరిచయస్తుడు కనిపించి పల్లికిలించక మానడు. తనని గుర్తుపడతారు. అంతే. సత్యనారాయణగారి మనవడో, మనవరాలో ఎవరో ఒకరి చావు వార్త చెవిన వేస్తారు. పాము కాటు. తన పుణ్యం. ఎన్ని చావులు వినాలో. హత్యలకీ దీనికీ తేడా ఏవుంది?

శ్రీనివాసరావు తీవ్రంగా ఆలోచించి జాగ్రత్తగా పెద్దగడ్డం పెంచాడు. కళ్లజోడు పెట్టుకుని మధ్యపాపిడి తియ్యడం మొదలెట్టేడు. ("నాన్నేంటమ్మా, మెంటలా?") పేంటూ చొక్కా మానేసి కుర్తా పైజమా అలవాటు చేసుకున్నాడు. అద్దంలో చూసుకుంటే తనకే కొత్తగా ఉన్నాడు. ఎవరూ గుర్తుపట్టలేరు. నడకమార్చుకోడానికి ప్రయత్నించినా కుదరలేదు. ఒకరోజు ఆఫీసు నుంచి వస్తూ రవి కోసం నోట్సు పుస్తకాల షాపులోకి వెళ్లేడతను. మూడు తోక పుస్తకాల్ని దారంతో కడుతున్నాడు కుర్రాడు.

"గుడ్ ఈవెనింగ్ అంకుల్."

అతని వీపు మీద పాము బుసలా కొట్టింది పిలుపు. తన వెనక్కి తిప్పలేదు. కుర్రాడి చేతుల్లోంచి పుస్తకాలు లాక్కుని గిరుక్కున వెనక్కి తిరిగేడు. అడ్డంగా శర్మగారి మనవడు. నోటితో కళ్లతో నవ్వుతూ నుంచున్నాడు.

"రవి ఏం చేస్తున్నాడంకుల్?"

రవి బాగానే ఉన్నాడని చెప్తాడు. తాతగారు బాగున్నారా అనడుగుతాడు తను. బాగున్నారంటాడు. క్షణం ఆగి చెప్తాడు.

"అంకుల్ మన వీధి వెనక సత్యంగారు పాపం పాము కరిచి చచ్చిపోయారు." అంతే. క్షణం ఆలోచించాడు. కుర్రవాడి వేపు అయోమయంగా చూశాడు.

"నే నంకుల్. శర్మగారి మనవణ్ని. సతీష్."

"శర్మగారెవరు?"

"....... అంకుల్ మీరు ..... రవి డాడీ కాదా?"

"రవి ఎవరు?"

"అంకుల్ మీరు శ్రీనివాసు అంకులే కదా?"

"శ్రీనివాసులు ఎవరు?"

షాపు పై మెట్టు మీంచి కిందికి ఉరికి అతను స్కూటరు మర్చిపోయిరోడ్డు చివరి దాకా పారిపోయాడు. అంతకష్టపడి మారువేషంలో తిరుగుతున్నా గాడిద కొడుకు ఇట్టే గుర్తు పట్టేడు. ఈ పిల్ల శనిగాళ్లని ఏమార్చడం ఎవరి వల్లా కాదు. ఆగి ఓ కొట్టు పక్కన జరిగి నుంచున్నాడతను.

"చేసిన పాపం ఊరికే పోదు. కుట్టి కుడుపుతుంది". ఉలిక్కిపడ్డాడతను. పక్కనే ఒకాయన పేపరు పొట్లంతో నుంచుని ఉన్నాడు.

"నేనేం చెయ్యలేదు. చెప్పలేదంతే. నేను నరకానికి పోతానా?"

"చెప్పకపోవడం ఏవిటిసార్?"

"అదే...."

"నేను మిమ్మల్ని అండం లేదు. చూడండి. అరకేజీ కారం కొన్నాను. అంతా మోసం సగానికి సగం రంగేసిన తవుడు. పాపం ఊరికే పోదు. మన ఉసురు తగలక మాన్తుందంటారా?"

"సార్. ఉసురు తప్పక తగుల్తుందంటారా?"

"ఖచ్చితంగా. ఇటువంటి పాపపు పన్లు చేస్తే తగలక ఏం చేస్తుంది?"

"మీకు తెలిసినవాళ్లెవరేనా ఉసురు తగిలి చచ్చిపోయారా?"

"బలేవా రండీ మీరు. చస్తే ఉసురు తగిలి చచ్చేవని ఎవరేనా చెప్తారా? లేకపోతే డాక్టరుకి తెలుస్తుందా?"

"మై గాడ్. మొత్తానికి ఉసురు తప్పదు. అంతేనా? తీసుకు తీసుకు చస్తారన్నమాట."

"ఆహా. చేసిన పాపం ఊరికే పోదు. అలాగూ చావొచ్చు. లేదా బస్సుకిందో కారుకిందో పడిచావొచ్చు. లేదా పురుగో పుట్రో కుట్టి ధామ్మని చావచ్చు. ఇవేవీ కాకపోతే లోపలలోపల కుళ్లి ఛస్తారు. వీడలాగే పోతాడు."

"ఉసురే?"

అతను వెనక్కి తిరిగి స్కూటరు కోసం పరిగెట్టేడు. ఎన్నాళ్లయినా శ్రీనివాసుకి పీడకలలు మానలేదు. ఒకసారి ఒక పెద్ద నల్లటిపాము అతన్ని చుట్టేసి నాలికతో బుగ్గనాకడం మొదలుపెట్టింది. అతను కళ్లు తెరిచినప్పుడల్లా అతని వేపు చూసి నవ్వి మళ్లీ నాలికతో నాకడం మొదలుపెట్టింది. మర్నాడుదయం కారం వాడి మాటలు గొర్తొచ్చేయి. లాభం లేదు. ఎవరూ రక్షించలేరు. ఆఫీసుకెళ్లగానే ఏ.డీ.గారు పిలిచేరు.

"శ్రీనివాసరావుగారూ మీకేం పిచ్చా చాదస్తవా?"

అతనేం మాట్లాడలేదు. అతను పెట్టుకున్న కాయితం ఏడీగారి చేతిలో పాము పడగలా ఊగుతోంది.

"అర్థం ఉండాలి. గత ఇరవై ఏళ్లలో ఈ డిపార్ట్‌మెంటు నుంచి ఎవరైనా ట్రాన్స్‌ఫరయ్యారా? పోనీ ఎవడేనా ట్రాన్స్‌ఫరయి వచ్చేడా? ఈ నిష్టదరిద్రపు డిపార్టుమెంటులో బదిలీలు ఉండవని మీకు తెలీకుండానే ఉద్యోగం చేస్తున్నారా? పైగా ఆ గడ్డం ఏవిటి? ఛండాలంగా ఉంది." కాయితం పరపరచింపి కింద బుట్టలో పడేశా డాయన. అంటే ఇంక తనకి మోక్షం లేదు. చస్తూ బత కాల్సిందే. నిద్రలేక బతికిబతికి ఎప్పుడో కారంవాడు చెప్పినట్టు ఉసురుపండి ఛస్తాడు. (టి. శ్రీనివాసరావు. జననం: 1950, మరణం: 1995) గడ్డం గొరికించుకోమని గట్టిగా చెప్తే ఏమైపోవాలి తను?

పాప భారం మోసి మోసి శ్రీనివాసు ఒకరోజు ఖాయిలా పడ్డాడు. నీరసించి ఆఫీసులో కళ్లు తిరిగిపడిపోయాడు. ఆస్పత్రిలో మెళుకువ వచ్చింది. తెల్లటి పాము ముంజేతి మీదికి వాలి ఉంది. కాటేసి నట్టుంది. చురుక్కుమంది. కళ్లు పెద్దవి చేసి చూశాడు.

"బాగా నీరసంగా ఉన్నారని సెలైన్ ఎక్కిస్తున్నారు. ఎలా ఉంది?" భార్య అడిగింది.

"నాకేవయింది?"

"నీరసం. నాలుగు రోజుల్లో మామూలయిపోతారు. భయపడకండి."

"ఉసురా?"

"ఛ. ఉసురేవిటండీ"

"తగుల్తుందని కారంవాడు అన్నాడు" అంటూ నిద్రలోకి జారేడు. శ్రీనివాసుని అతనూహించినట్టే నరకానికి తీసుకెళ్లేరు. ముందు కొరడాలతో చితకబాదేరు. తరవాత కాసేపు వేన్నీళ్లలో ఉడకపెట్టేరు. బయటికి లాగి మళ్లీ కూచోపెట్టేరు. కాస్త ఓపిక వచ్చిన తరవాత మళ్లీ చితకబాదడానికి కొరడాలు సిద్ధం చేసుకుంటున్నారు. గారపాటి సత్యంగారు మంచి హుందాగా పక్కనించి వెళుతూ అతని వేపు చూసి నవ్వేరు.

"సత్యంగారూ, మీకు చెప్దావనే అనుకున్నాసార్. కానీ..." ఆయన ఇంకా పెద్దగా నవ్వి వెళ్లిపోయారు. శ్రీనివాసుకి భోరున ఏడుపొస్తూండగా ఇద్దరు కొరడాలు అందు కున్నారు. కెవ్వుమన్నాడు శ్రీనివాసు.

కొన్ని నెలల క్రితం. ఒకరోజు సాయంత్రం శ్రీనివాసు స్కూటరు మీద ఇంటి కొస్తున్నాడు. రవికి చాక్లెట్లు, రవి తల్లికి పూలు కూడా కొన్నాడు. ఎదురుగా జీపు వస్తోంది. స్కూటరు వేగం తగ్గించేడతను. మరో వంద గజాలు వెళ్లి సందు తిరగాలి. జీపు పక్కనించి

వెళ్లిపోయింది. మళ్లీ వేగం పెంచి కళ్లజోడు సద్దుకుని నిర్జీవంగా ఉన్న రోడ్డుని చూశాడు. గుండె ఆగి మళ్లీ కప్పలా కొట్టుకుంటోంది. ఇంకా ఎండగానే ఉంది. అతని స్కూటరు ముందునుంచీ గోధుమ రంగులో ఉత్తమ వంశానికి చెందిన పొడుగాటి పాము ఎండలో మెరుస్తూ హడావుడిగా ఎడమవేపు తిరిగి గారపాటి సత్యంగారి కారు షెడ్డు గేటులోంచి లోపలికి వెళ్లిపోయింది. కొద్దిలో స్కూటరు కిందపడి చచ్చి ఉండేది. లేదా కిందపడి దాని కాటుకి తాను చచ్చి ఉండేవాడు. గారపాటి సత్యంగారు తనకి తెలుసు. పెద్దవాడు. మనవలు మనవరాళ్లలో ఇల్లెప్పుడూ వేసంగుల్లో సందడిగా ఉంటుంది. ఇంటి గేటు కూడా దగ్గిరికి వేసుంది. ఇంటికి వెళ్లిపోయాడు శ్రీనివాసు.

సాయంకాలం చల్లబడ్డ తరవాత బయటికొచ్చి నడుచుకుంటూ సత్యంగారింటికి కొంచెం దూరంగా నుంచున్నాడు శ్రీనివాసు. ఇంకా ఎవరూ పోలేదు. లోపలికి వెళ్లి ఆయనకి చెప్పాలి. అలాగే నుంచుని కాసేపు వీధి చివరికి వెళ్లి సిగరెట్టు కొనుక్కుని కాల్చి వెనక్కి వచ్చే డతను. లోపలికి వెళ్లి చెప్పాలి. రాత్రి పూటగాని పాము బయటికి రాదు. కారులోకి వెళ్లిపోతే? ఇంట్లోకి కూడా జారుకుని ఉంటుంది. మెత్తగా నీటి ధారలా సాగుతూ లోపలికి వెళ్లినా ఎవరూ గమనించరు. చెప్పాలి తను. లోపలికి వెళ్లి సత్యం గారికి చెప్పాలి గదా. మరో పది నిమిషాలు నుంచుని ఇంటికి వెళ్లిపోయాడతను.

రెండ్రోజులు గడిచింది తరవాత. సత్యంగారింట్లో ఎవరూ పోలేదు. అతను చెప్పలేదు. ఫోన్ చేద్దామనుకున్నాడు శ్రీనివాసు. ఫోను పక్కనే కూచుని దానివేపు రెప్ప వాల్చకుండా చూశాడు. సత్యంగారి నెంబరు తనకి తెలీదు. పాము కాటుకి అంటారుగానీ విరుగుడు లేదు. డాక్టరు దగ్గిరికి వెళ్లేలోగా ఏం బతుకుతారు? మరో నాలుగు రోజులు గడిచేయి. ఆ రోజు రాత్రి రవి పాముల గురించి పాఠం చదువుతున్నాడు.

"రవీ పాములు ఎన్ని రకాలురా?"

"డాడీ. పాములన్నీ విషజంతువులు కాదు. చాలా పాములు కుట్టినా చచ్చిపోరు. వాటికి మనుషులంటే భయం."

"విషం పామో మంచి పామో ఎలా తెలుస్తుందిరా?"

"భయంలేకుండా చూస్తే తెలుస్తుంది డాడీ. కానీ భయవేసి ముందు చచ్చిపోతారు."

"మొత్తానికి పాము కుడితే చావడం ఖాయం"

"అవును డాడీ."

అతను చెప్పలేదు. మరో వారం గడిచింది. అతనికి నిద్రపట్టడం లేదు. చెప్పనే లేదు తను. పిన్నలు పెద్దలు ఎవర్ని కుట్టినా అంతే ఇంక. అన్నం తినబుద్ధికావడం లేదు. నోర్రాలేదేం? ఒకరోజు వీధిలోకి పాములవాడు ఒచ్చేడు.

"రేయి, పాము ఇంట్లో చొరబడితే ఏ వవుతుంది?"

"కరుస్తదండి. కరిసిన మనిషికి ప్రేణం పోద్దండి మీకు తెల్దేటండి. పాముగాని ఒచ్చిందేటండి?"

"ఇంట్లోకి వచ్చి ఏం చెయ్యకపోతే వెళ్లిపోతుందా?"

"ఎల్లి పోద్దండి. కానీ అలవాటై పోద్దండి. ఏ మూలో వచ్చి పడుకుంటదండి. మనం ఏ సీకటి మాట్లో ఓటికో రెంటికో లెగిసే వనుకోండి. ఏసేత్తదండి"

తెల్లవారుతోందంటే అతనికి భయంగా ఉంది. చీకటి పడుతోందన్నా భయం. ఈ రెంటి మధ్యా తచ్చాడుతున్నాడతను. అతని కళ్లకింద నల్లమచ్చలు పరుచుకున్నాయి. ఆఫీసులో కూచుని జోగుతున్నాడు. తను చెపపనేలేదు. ఫోను చెయ్యలేదు. ఆఫీసులో జోగుతూండగా ఫోనొచ్చింది. ఇంటి నుంచి భార్య మాట్లాడింది.

"హలో.. ఏవండీ, బిజీయా? మీకోమాట చెప్పాలని ఫోన్ చేస్తున్నా."

"అయ్యో, సత్యంగారు పోయారా? ఎప్పుడూ?"

"సత్యంగారు పోవడం ఏవిటండీ? మీకు లిస్టు ఇచ్చేను గదా, అందులో చాయ మినప్పప్పు మర్చిపోయాను. రాసుకోండి".

("గంటయింది. సాయంకాలం తీసికెళ్తారు")

"ఆ. సరే."

"మర్చిపోరు గదా? మీకసలే మతిమరుపు."

( "పాముకరిచి పోయారట" )

"మర్చిపోను. సాయంకాలం వస్తాను."

("ఇదంతా మీ పుణ్యవే. మర్చిపోకండి")

మరోపది రోజులు గడిచిపోయాయి. ఇంక ఇప్పుడు చెప్పినా ఏం లాభం? ముందే ఎందుకు చెప్పలేదంటే? గారపాటి సత్యంగారింటి ముందు నుంచి నడవడం మానేశాడు శ్రీనివాసు. మరో పదిరోజుల తరవాత అతను ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయాడు.

❖ ❖ ❖